క్లుప్తంగా

28న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పూజలు

జంగారెడ్డిగూడెం : ఈ నెల 28 శనివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు జాతీయ రహదారి వద్ద గల పారిజాతగిరి ఆర్చి నుంచి కొండపైకి మెట్ల మార్గం ద్వారా పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి పట్టణం, మండలం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

చింతలపూడి: తిరుమల తిరుపతి పవిత్రతపై టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఏఎంసీ మాజీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. తిరుమల పవిత్రతను కాపాడాలని కోరుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 28న మండలంలోని అన్ని దేవాలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చింతలపూడిలో ఆమె మాట్లాడుతూ అదే రోజు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలలో శ్రీవారిని దర్శించుకొని పూజల్లో పాల్గొంటారన్నారు. కల్తీ నెయ్యి కలిపిన లడ్డూలను భక్తులకు పంపిణీ చేశారని వేంకటేశ్వరస్వామి ప్రతిష్టను దెబ్బతీసేలా టీడీపీ చేస్తున్న ఆరోపణలను తిప్పి కొడుతూ ప్రతీ ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నాయకుడు పూజల్లో పాల్గొనాలని కోరారు.

మహాజన సమావేశం

టి.నరసాపురం: మధ్యాహ్నపువారిగూడెం సొసైటీలో గురువారం మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యర్రా ఏసుకుమార్, సంఘ రైతులు పాల్గొని ఈ సమావేశంలోని జమా ఖర్చులు, ఆడిట్ రిపోర్టు, పలు అంశాలను చర్చించినట్లు సభ్యులు తెలిపారు. సమావేశంలో మాజీ అధ్యక్షులు, మాజీ డైరెక్టర్లు రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం అమ్ముకోవాలి

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణికల ప్రకారం రైతులు మద్దతు ధరకే ధాన్యం అమ్ముకోవాలని జంగారెడ్డిగూడెం తహసీల్దార్ స్లీవజోజి అన్నారు. మండలంలోని పంగిడిగూడెంలో దాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ క్వింటాల్ ధాన్యానికి ప్రభుత్వం రూ.2,300 నిర్దేశించిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ స్లీవజోజి అన్నారు. సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, ఏవో కెవీఎస్ పోశారావు పాల్గొన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు

వేలేరుపాడు: నార్లవరంలో పోషకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నార్లవరం పంచాయతీ పరిధిలో సూపర్‌వైజర్ మయూరి, నార్లవరం అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించి, మాల్ న్యూట్రిషన్‌పై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్, సైదాపత్ర లీలావతి, విజయ, నాగమణి, కమల, తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం..!

- సిబ్బంది నిత్యం విధులకు డుమ్మా
- సమయపాలన పాటించని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది
- పనులు జరగక తల్లడిల్లుతున్న గిరిజనం

వేలేరుపాడు: తమకు ఇష్టం వచ్చినప్పుడు విధులకు హాజరవుతారు. ఒక్కోసారి అది కూడా ఉండదు. జిల్లాలో మారుమూల గిరిజన ప్రాంతం, అడిగే దిక్కులేదు. ఆ అధికారులు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా తయారైంది. ఇదీ వేలేరుపాడు మండలంలో ఎంపీడీవో కార్యాలయ దుస్థితి. ఈ కార్యాలయంలో అసలే సిబ్బంది కొరత పట్టి పీడిస్తుండగా, ఉన్న ఎంపీడీవో, సీనియర్ అస్టెంట్ నిత్యం విధులకు గైర్హాజర్ అవుతున్నారనే ఆరోపణలు పుష్కలంగా ఉన్నాయి. వారం రోజులుగా ఎంపీడీవో, సీనియర్ అస్టెంట్ విధులకు డుమ్మా కొట్టడంతో పనుల కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పనులు కాక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో, సీనియర్ అస్టెంట్ సమయ పాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలున్నాయి. వీరిద్దరూ స్థానికంగా నివాసముండటం లేదు. సీనియర్ అస్టెంట్, ఎంపీడీవో తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేటలో నివాసముంటూ రాకపోకలు సాగిస్తున్నారు. బుధవారం, అసలు ఎంపీడీవో విధులకు హాజరు కాలేదు. ఎంపీడీవో గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు విధులకు హాజరవగా, సీనియర్ అస్టెంట్ 11.30 గంటలకు హాజరయ్యారు. ఇలా నిత్యం సమయపాలన పాటించకుండా ఇద్దరు అధికారులు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఈ అధికారులు తమకు ఇష్టం వచ్చినట్లు విధులకు హాజరవుతున్నారు. ఈ మండల పరిషత్ కార్యాలయ పరిధిలో తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 21 పోస్టులున్నాయి. ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీ, జూనియర్ అస్టెంట్, సూపరింటెండెంట్, ఒక ఎంఈవో, ఒక పీఆర్ ఏఈ, మూడు అటెండర్ పోస్టులు, ఒక టైపిస్టు, తొమ్మిది మంది గ్రామ పంచాయతీ సెక్రటరీలకు గాను, ఇందులో నాలుగు పోస్టుల్లో మాత్రమే అధికారులు పని చేస్తున్నారు. 21 రెవెన్యూ, 57 వరకు శివారు గ్రామాలున్న వేలేరుపాడు మండలంలో అనేక సమస్యలు తిష్ట వేశాయి. ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. బ్లీచింగ్



వేలేరుపాడు ఎంపీడీవో కార్యాలయం

చల్లించిన దాఖలాలు లేవు. మంచినీటి పథకాలు మూలన పడి నెల రోజులు దాటుతోంది. దీంతో ప్రజలు తాగునీటికి తల్లడిల్లిపోతున్నారు. గ్రామాల్లో క్లోరినేషన్ చేయడం లేదు. దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది, ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నిత్యం తాళం వేసి ఉంటున్న వేలేరుపాడు ఎంపీడీఓ కార్యాలయ గది →



కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ

జంగారెడ్డిగూడెం: ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా వైఎస్సార్‌సీపీ తలొగ్గదని, నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడూ తోడుగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. గురువారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని బత్తిన లక్ష్మి, నాయకులు బత్తిన చిన్న మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో ప్రస్తుత పరిస్థితులను వివరించామని, పార్టీ శ్రేణులకు ధైర్యం కల్పించి, రాబోయే పోరాటాలకు సన్నద్ధం చేయాలని



వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడుతూ అండగా ఉంటుందని పేర్కొన్నారన్నారు.

సూర పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

కొయ్యలగూడెం: వర్జీనియా సూర (స్క్రాప్) పొగాకు కొనుగోళ్లు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 25తో లీఫ్ కొనుగోళ్లు పూర్తయ్యాయని ఏఎస్ గ్రేసీ మార్గరేట్ తెలిపారు. రైతుల నుంచి మొత్తంగా రూ.478 కోట్ల విలువైన పొగాకును 53 కంపెనీలు కొనుగోలు చేశాయన్నారు. అత్యధికంగా కిలోకు రూ.410, అత్యల్పంగా రూ.100 ధర పలికిందన్నారు. సూర పొగాకు కొనుగోళ్లు వారం లోపు ముగుస్తాయన్నారు. అలాగే బ్యారన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, రైతులు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని తెలిపారు.

ముగిసిన వేలం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల్లో పొగాకు వేలం ముగిసింది. జంగారెడ్డిగూడెం-1 కేంద్రంలో రూ.486.38 కోట్ల విలువైన 15.04 మిలియన్ కిలోలు వర్జీనియా పొగాకును రైతులు విక్రయించారు. అత్యధికంగా కిలోకు రూ.410, అత్యల్పంగా రూ. 50 ధర లభించింది. సగటు ధర రూ. 323.40. జంగారెడ్డిగూడెం-2 కేంద్రంలో రూ. 490.02 కోట్ల విలువైన 15.15 మిలియన్ కిలోలు పొగాకు విక్రయాలు జరిగాయి. అత్యధికంగా కిలో రూ.411 ధర లభించింది.

దేవీ నవరాత్రులకు ఏర్పాట్లు



గురవాయిగూడెం బ్రహ్మసూత్ర శైవక్షేత్రం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం పంచాయతీ శివపురంలో బ్రహ్మసూత్రం శైవక్షేత్రమైన శ్రీరాజ శ్యామలాపూర్వక రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో దుర్గా శరన్నవ రాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దల్లి గోపి నాగప్రసాద్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు నిర్వహించే దసరా మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

బుట్టాయగూడెం: విద్యార్థులు లక్ష్యంతో చదివి శిఖరాలను అవరోధించాలని జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు అన్నారు. జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ అనే అంశం, సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వారు వెంటనే 1930కి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఆ సమయంలో సైబర్‌సెల్ అధికారులు సహాయ సహకారాలు అందిస్తారన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

నేడు ద్వారకాతిరుమలలో రైతు సదస్సు

ద్వారకాతిరుమల: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ద్వారకాతిరుమలలోని శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించే రాష్ట్ర రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు కోరారు. స్థానిక యూటీఎఫ్ భవనంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర రైతు సదస్సులో రైతులు పాల్గొనాలని కోరారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సంఘ రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పాల్గొంటారని తెలిపారు.

భళా.. రామ

కొయ్యలగూడెం: దాసరోజు నిటలాక్ష రామకు యూఎస్ఏకి చెందిన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. మూడేళ్ల వయసులో ఐదు వరల్డ్ రికార్డ్స్ సాధించడంతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చూపినందుకు యూఎస్ఏ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించారు. ×బహుముఖ ప్రజ్ఞా పాటవాలు కలిగిన చిన్నారి₹ ×మల్టీ టాలెంటెడ్ కిడ్₹ అంటూ వరల్డ్ రికార్డు అందించారని తల్లిదండ్రులు శ్రీనివాసరావు, రసజ్ఞ తెలిపారు. నిటలాక్ష రామను రచయిత ప్రొఫెసర్ వూటకూరి వరప్రసాద్ తదితరులు అభినందించారు.



అవార్డుతో నిటలాక్ష రామ

ఏజెన్సీ వివాదాలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: పశ్చిమ ఏజెన్సీలోని భూ సమస్యలు పరిష్కారానికి అధికారులు ఇరుపక్షాల భూ రికార్డులను టైటిల్ వెరిఫికేషన్ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ భూ భాగం స్థానిక గిరిజనులకే చెందుతుందన్నారు. రెవెన్యూ అధికారులు భూ రికార్డులు టైటిల్ వెరిఫికేషన్ చేసి, గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. సమస్యలతో కూడిన వినతి పత్రాలను ఆర్డీవో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. సీపీఎం జిల్లా నాయకులు తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు, మండల నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, ఆర్.దానియేలు, పి.గంగరాజు, కారం ముత్యాలరావు యం.గంగాదేవి, యం.కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కామ్రేడ్ ఆర్ఎస్‌కు ఘన నివాళి

కమ్యూనిస్టు ఆదర్శ నేత కామ్రేడ్ ఆర్ఎస్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. గురువారం ఏలూరు రోడ్‌లో రోటరీ హాలులో ఆర్ఎస్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షత వహించగా ఆర్ఎస్, సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటాలకు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం, ఎ.రవి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి, కె.రమణ రాజు, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు ఎంఎస్ నాగరాజు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కేవీ రమణ, తలారి ప్రకాష్, ప్రముఖ వైద్యులు రామలక్ష్మి నర్సింగ్ హోమ్ డాక్టర్ డి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు క్షేత్రంలో స్వచ్ఛతా హీ సేవ

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అందులో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, 10 గంటల నుంచి ఆలయ ఆవరణలో కార్మికులు, యువతతో పారిశుద్ధ్య పనులు నిర్వహించి, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం టూరిజం బ్రోచర్‌ను విడుదల చేస్తారని, 10.30 గంటలకు కలెక్టర్ ప్రసంగిస్తారన్నారు. 10.45 గంటలకు ప్రపంచ పర్యాటక దినోత్సవ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం, ధృవ పత్రాల అందజేతతో ఈ కార్యక్రమాలు ముగుస్తాయన్నారు.

నేటి నుంచి పారిజాత గిరి పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 27 శుక్రవారం నుంచి 30 సోమవారం వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నామని కార్య నిర్వహణ అధికారి మాణికల రాంబాబు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు కార్యక్రమాన్ని వివరిస్తూ ఆలయంలో నిర్వహించే నిత్య, వార, మాస, వార్షిక కైంకర్యాలలో తెలిసి కానీ తెలియక కానీ ఏవైనా దోషాలు సంభవిస్తే ఆ దోష పరిహారం కోసం ప్రాయశ్చిత్తంగా ఈ పవిత్రోత్సవాలు ప్రసిద్ధ క్షేత్రాలలో నిర్వహిస్తారన్నారు. దీంట్లో భాగంగా పారిజాతగిరిక్షేత్రంలో ప్రతీ ఏటా భాద్రపద మాస కృష్ణ పక్షంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



సూర్యారావుకు నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ బాబ్జి

కొయ్యలగూడెం: బయ్యనగూడెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తోట జయబాబును జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ పోలనాటి బాబ్జి గురువారం పరామర్శించారు. ఇటీవల జయబాబు తండ్రి సూర్యారావు మృతి చెందడంతో సీతంపేటలోని ఆయన నివాసానికి వెళ్లి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి సూర్యారావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అదే విధంగా రాష్ట్ర యువజన వైఎస్ఆర్‌సీపీ నాయకులు కృష్ణ స్వరూప్ జయబాబును పరామర్శించారు. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాలకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డ్రెయిన్లను పునరుద్ధరించాలి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని వేగవరం జాతీయ రహదారికి ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన వ్యాపార దుకాణాలను తొలగించి, డ్రెయిన్లను పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు కలింపూడి సుందరరావు, భాస్కర్, వెంకటేష్, సత్తన్న బాబురావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రెయిన్లను పూడ్చి షాపులు కట్టారని, దీని వలన వర్షపు నీరు రహదారి మీదుగా పల్లపు ప్రాంతాల్లోని గృహాలను ముంచెత్తుతుందన్నారు. వరద నీటి ముంపుతో గృహాలు దెబ్బ తిని కూలిపోతున్నాయని వారు వాపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పొగాకు వేలం అధికారులకు సత్కారం

జంగారెడ్డిగూడెం : స్థానిక 2వ వేలం కేంద్రంలో వర్జీనియా పొగాకు వేలం గురువారం ముగియడంతో వేలం కేంద్రం అధికారులను, సిబ్బందిని రైతులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేలం అధికారి సురేంద్ర, రైతు సంఘాల నాయకులు సత్రం వెంకట్రావు, వామిశెట్టి హరిబాబు, కరాటం రెడ్డిబాబు, గడ్డమణుగు దత్తుడు, అట్లూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

టి.నరసాపురం: ఆశ వర్కర్ లక్ష్మీ మంగను విధుల నుంచి తొలగించడం రాజకీయ కక్ష సాధింపేనని, మండలంలోని ఆశ వర్కర్లు ఆందోళన చేశారు. ఆశ వర్కర్ల యూనియన్ సభ్యులు విజయలక్ష్మి, వనిత జ్యోతి తదితరులు పీహెచ్‌సీ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆశ వర్కర్ లక్ష్మీమంగను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు విజయలక్ష్మి, వనిత, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం

జంగారెడ్డిగూడెం : చింతలపూడి నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ గురువారం ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.నరేంద్రకుమార్, కౌన్సిలర్లు, నాయకులు, మెప్మా టీఎంసీ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. స్థానిక హైమావతి సూపర్ మార్కెట్ రోడ్‌లో నివసిస్తున్న నరం చరణ్‌రాజు ఈ నెల 18న ఇంటి నుంచి విజయదుర్గ గోడౌన్స్‌లో పనికి వెళ్లాడన్నారు. అయితే తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య నాగరత్నం చరణ్‌రాజుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చిందన్నారు. గోడౌన్స్ యజమానికి ఫోన్ చేయగా, పనికి రాలేదని సెలవు పెట్టినట్లుగా చెప్పారన్నారు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య నాగరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు

కామవరపుకోట: రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ బేస్‌బాల్ పోటీలకు కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయులు గస్ బాబు గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు తూంపాటి బాబూరావు, జి.శ్యామలదేవిలను ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.

ఆడమిల్లి విద్యార్థుల ఎంపిక

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ పోటీలకు ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.విజయభారతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు.

మండల విద్యార్థుల ప్రతిభ

లింగపాలెం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు హెచ్‌ఎం బి.వెంకటరత్నం తెలిపారు. ఏలూరులో నిర్వహించిన అథ్లెటిక్స్ ఈవెంట్లలో పలువురు విద్యార్థులు గెలుపొందారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను, పీడీ లక్ష్మిని హెచ్‌ఎం వెంకటరత్నం అభినందించారు.

కొత్తపల్లి విద్యార్థుల ఎంపిక

లింగపాలెం: జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ మరియు బేస్ బాల్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపల్లి విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం పెదవేగి సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో పోటీలు నిర్వహించారు. అండర్-14, అండర్-17 పోటీలకు బాల బాలికలు ఎంపికయ్యారు.



కామవరపుకోట: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కేకోట విద్యార్థులు

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

టి.నరసాపురం: మండలంలోని అప్పలరాజుగూడెం ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు హెచ్‌ఎం. డీఎస్‌బీ శంకరావు తెలిపారు. ఏలూరులోని సీతారామ స్టేడియంలో అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, జావలిన్ త్రో విభాగాల్లో విద్యార్థులు ప్రతిభను కనబరిచి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో 14 మంది విద్యార్థులు ప్రతిభను కనబరిచారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ లాహిరి దుర్గ పాల్గొన్నారు.

కేతవరం విద్యార్థిని ఎంపిక

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. హెచ్‌ఎం ఎంవీ అప్పారావు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఈ నెల 25న పెదవేగి గురుకుల పాఠశాలలో నిర్వహించిన బేస్‌బాల్ పోటీల్లో బాలికల అండర్-14 విభాగంలో మండలం విద్యార్థిని కొలుకులూరి హేమశ్రీ పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు తెలిపారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రమేష్‌ని ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్ గంటా బుజ్జిబాబు, గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

రామసింగవరం విద్యార్థినుల ఎంపిక

ద్వారకాతిరుమల: రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు మండలంలోని రామసింగవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, వారికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్‌ను ప్రధానోపాధ్యాయులు కె.జయ సుభాకరరావు, ఎస్ఎంసీ సభ్యులు, సీనియర్ ఉపాధ్యాయులు డి.సూర్య ప్రకాష్, వరప్రసాద్, తదితరులు అభినందించారు.



లింగపాలెం: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



టి.నరసాపురం: అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గురుకుల పాఠశాల విద్యార్థులు



ద్వారకాతిరుమల: సెపక్ తక్రా పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, తదితరులు